## క్లుప్తంగా

### ఆధార్ కేంద్రం ప్రారంభం

**లింగంపేట(ఎల్లారెడ్డి):** శెట్పల్లి జీపీలో శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆధార్ కేంద్రంలో పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్, ఫొటో మార్పిడి, తప్పొప్పులు సరిదిద్దుకొనే అవకాశం ఉందన్నారు. నూతన ఆధార్ కార్డు సైతం పొందవచ్చన్నారు. పోస్టాఫీసు సబ్ డివిజన్ ఐపీవో శ్రావణ్ కుమార్, మొహబూబ్ రెడ్డి, అంబర్‌సింగ్, కార్యదర్శి సిద్ధిఖీ, గంగారెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

### సోయా పంటల పరిశీలన

**బిచ్కుంద(జుక్కల్):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని, రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో పోచయ్య సూచించారు. శుక్రవారం గుండెకల్లూర్‌లో పంట క్షేత్రాలకు వెళ్లి సోయా పంటను పరిశీలించారు. పంట చేనులో నీరు నిలువ ఉండకుండా చిన్న కాలువలు తీసి బయటకు నీరు వెళ్లే విధంగా చూడాలని సూచించారు.

### సింగరాయపల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన

**రామారెడ్డి:** పాల్వంచ మండలంలోని సింగరాయపల్లిలో శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఎఫ్‌వో నికిత, అడిషనల్ ఎస్పీ అన్యోన్యతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీని, పల్లె ప్రగతిలో భాగంగా చేట్టిన పనులు, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయడంలో భాగంగా వారి పనితీరు పరిశీలించడానికే అదనపు కలెక్టర్ పర్యటించినట్లుగా మండల అధికారులు చెబుతున్నారు.

### వినూత్న నిరసన

**భిక్కనూరు:** ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు మండలం కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిర్వహిస్తున్న నిరసన దీక్షలు 88వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం గ్రామస్తులు దీక్ష శిబిరంలో కూర్చుని తమ తలలను కిందకు వాల్చి ఎంఎస్ఎన్ భూతం నుంచి రక్షించాలంటూ నినాదాలు చేశారు.

### ఈవీఎంలపై అవగాహన

**ఎల్లారెడ్డి:** తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డితండా జీపీ కార్యాలయాలలో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ఎంపీవో ప్రకాష్ శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసే సమయంలో తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. కార్యదర్శులు విజయ్ కుమార్, సలీం, గ్రామస్తులు ఉన్నారు.

### ‘వీడీసీ నిర్ణయాలు చెల్లుబాటు కావు’

**భిక్కనూరు:** మండలంలోని కాచాపూర్ వీడీసీ పదవీ కాలం ముగిసిందని సర్పంచ్ తొగరి సులోచన అన్నారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన జీపీ పాలకవర్గం సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ గాలిరెడ్డి, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలో వీడీసీ కాలపరిమితి ముగిసిందని ఇక మీదట ప్రస్తుత వీడీసీకి ఎలాంటి అధికారం లేదని తీర్మానించారు. వారం పదిరోజుల్లో ఇప్పటివరకు ఉన్న గ్రామాభివృద్ధి కమిటీ వారు ఆదాయ వ్యయాలను గ్రామపంచాయతీ వారికి చూపించి అప్పజెప్పాలని తీర్మానించారు. అనంతరం కుల సంఘాల వారు తమ తరఫున ఒక్కరికి వీడీసీ డైరెక్టర్‌గా సమ్మతిస్తూ లిఖిత పూర్వకంగా రాసి ఇస్తేనే వారికి వీడీసీలో డైరెక్టర్ పదవి ఉంటుందన్నారు.

### బల్దియాలో సమస్యలు పరిష్కరిస్తాం

**కామారెడ్డి టౌన్:** పట్టణంలోని వార్డుల్లో వర్షాల కారణంగా నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన 16వార్డు అశోక్‌నగర్ కాలనీలో పర్యటించారు. వార్డులో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డు కౌన్సిలర్ వంశీ, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ ఉన్నారు.

### అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నేతలు

**కామారెడ్డి టౌన్:** జిల్లాకు నూతన వచ్చిన అదనపు కలెక్టర్ ఎం.మను చౌదరిని శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బి. సాయిలు, పంచాయతి కార్యదర్శుల జిల్లా ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ అందజేత

**రామారెడ్డి:** కామారెడ్డిలో పోసానిపేట మినీ గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్, గోడ గడియారాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ శుక్రవారం రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డికి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం జాబ్స్ నోటిఫికేషన్లు వేసినందున నిరుద్యోగులకు అవసరమైన మెటీరియల్స్ అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో పున్న రాజేశ్వర్ అందించినట్లు ఎంపీపీ దశరథ్‌రెడ్డి తెలిపారు.

# నాలాలతో నానా అవస్థలు

- ముందస్తు చర్యలు లేక పట్టణంలోని పలు కాలనీల్లో నిలిచిన వర్షపు నీరు
- చినుకు పడితే అంతే.. ప్రతి ఏడాది ఇదే తీరు
- శాశ్వత పరిష్కారానికి చొరవ చూపని అధికారులు



బాన్సువాడ పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

**బాన్సువాడ :** ముందస్తు చర్యలు లేక పట్టణంలోని పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతుండగా.. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఈ పరిస్థితిపై ప్రజలు విన్నపాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని సాయికృపానగర్ కాలనీ, వాసవీ కాలనీ, టీచర్స్ కాలనీలు జలమయంగా మారాయి. ఇవి లోతట్టు ప్రాంతంలో ఉండగా..అశాస్త్రీయమైన డిజైన్లతో డ్రైనేజీలు, రోడ్లను నిర్మిస్తున్నారు. దీంతో చిన్న పాటి వర్షానికే వరద ఎక్కడిక్కడే నిలిచిపోతుంది. పట్టణంలోని చైతన్య కాలనీ, ఎన్జీవోఎస్ కాలనీ, టీచర్స్ కాలనీ, వాసవీ కాలనీ, బీసీ కాలనీ, సంగమేశ్వర కాలనీ, బీసీ హాస్టల్ రోడ్డు తదితర కాలనీల్లో వర్షపు నీరు నిలిచి కాలనీ వాసులకు ఇబ్బందులకు గురి చేస్తోంది. డ్రైనేజీ డిజైన్ లెవల్స్ రూపొందించడంలో ఇంజినీరింగ్ విభాగం విఫలమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నిర్మాణ పనులు జరిగే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పట్టించుకోకపోవడం లేదని చెబుతున్నారు. అయితే ఆయా కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపై నిలిచిన నీటి నిల్వపై అధికారులు ఎలాంటి సర్వే చేపట్టడం లేదు. ప్రతి ఏటా వర్షాకాలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. తాత్కాలిక చర్యల పేరిట రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. వర్షం నీటిని ఏ విధంగా తగ్గించాలనే విషయంలో మున్సిపల్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**కొత్త కాలనీల్లోనే సమస్య**

మున్సిపాలిటీల్లో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచి సమస్య ఏర్పడుతోంది. ఎప్పటికప్పుడు సిబ్బందితో సమస్యలు పరిష్కరిస్తున్నాం. వర్షపు నీరు తొలగిస్తున్నాం. రోడ్లు కిందికి ఉండడం, ఇళ్లు ఎత్తుగా ఉండడంతో సమస్య ఉత్పన్నమవుతుంది.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

## గ్రామాల్లో అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

**లింగంపేట(ఎల్లారెడ్డి):** భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఘటనలు జరగకుండా చూడడానికి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో మాట్లాడారు. అధికారులు సంబంధిత గ్రామాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

**దోమల నివారణకు చర్యలు**

**నిజాంసాగర్(జుక్కల్):** జుక్కల్ మండల కేంద్రంలో దోమల నివారణకు శుక్రవారం సాయంత్రం మందులు పిచికారీ చేయించినట్లు ఉప సర్పంచ్ భాను గౌడ్ తెలిపారు. అన్ని కాలనీల్లో ఫాగింగ్ యంత్రం ద్వారా మందును పిచికారీ చేసి దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మురుగు నీటి గుంతలు, డ్రమ్ముల్లో దోమలు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### పీర్ల ప్రతిష్ఠ

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని పొల్కంపేట, లింగంపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం పీర్లు ప్రతిష్ఠించారు. నాలెహజాద్, మౌలాలి, ఆశన్న, ఉషన్నలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి 29న సవారీలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### విద్యాశాఖ మంత్రిని కలవడాన్ని స్వాగతిస్తున్నాం



**బీబీపేట:** మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, బీఆర్ఎస్ నాయకులు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలవడం స్వాగతిస్తున్నామని జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. త్వరలో కోనాపూర్ గ్రామానికి మంత్రి కేటీఆర్ రానున్న తరుణంలో పర్యటనకు ముందే అధికారికంగా ప్రవేశాలు, తరగతులు చేపట్టాలని వారు కోరారు. ఒకవేళ ప్రకటన చేయకుండా పర్యటనకు వస్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని సాధన సమితి సభ్యులు హెచ్చరించారు.

### నీరు నిల్వ ఉండకుండా కాలువలు తీయాలి


పంటలను పరిశీలిస్తున్న ఏవో నరేశ్

**గాంధారి(ఎల్లారెడ్డి):** అధిక వర్షాలతో పంట చేలల్లో నీరు నిల్వ ఉండకుండా రైతులు కాలువల ద్వారా బయటకు పంపించి పంటలను కాపాడుకోవాలని ఏవో నరేశ్ సూచించారు. శుక్రవారం ఆయన నేరల్ తండా శివారులో పంటలను పరిశీలించారు. రైతులు తీసిన కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గే వరకు పంటలకు ఎరువులు వేయవద్దని, పురుగు మందులు పిచికారీ చేయొద్దని సూచించారు.

## సర్వసభ్య సమావేశం బహిష్కరణ

- ప్రజాప్రతినిధులు లేకుండానే సమావేశం కొనసాగింపు


బయటకు వెళ్తున్న ఎంపీటీసీ సభ్యులు

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రాజ్‌దాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎంపీటీసీ సభ్యులు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెంటనే తాము మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పి సమావేశపు హాల్ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో కేవలం అధికారులతోనే సమావేశం కొనసాగింది. మండల కో–ఆప్షన్ సభ్యుడు మినహా ఇతర సభ్యులెవరూ లేకపోవడంతో సమావేశంలో ఖాళీ కుర్చీలే ఎక్కువగా దర్శనమిచ్చాయి. ఎంపీటీసీలు బహిష్కరించినా ఇన్‌చార్జి ఎంపీపీ రాజ్‌దాస్ అధికారులతో సమావేశాన్ని కొనసాగించారు. వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో ఇటీవల తలెత్తిన కరెంట్ సమస్యతో పాటు ఇతర ఇబ్బందులపై ఆస్పత్రి అడ్వైజరీ కమిటీ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని డాక్టర్ సృజన్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో రఘు, తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్ తదితరులు పాల్గొన్నారు.

### పార్ట్‌టైం స్వీపర్ల ఆందోళన

**కామారెడ్డి రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన ఆగదని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ..స్వీపర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి


జీపీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

**బాన్సువాడ రూరల్:** గ్రామాల్లో పండ్ల తోటలు పెంచేలా పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలని బాన్సువాడ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కోనాపూర్ జీపీ కార్యాలయాన్ని సందర్శించారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జీపీ రికార్డులు పరిశీలించారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

**సదాశివనగర్/మాచారెడ్డి:** గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సదాశివనగర్ ఎంపీడీవో లక్ష్మి, మాచారెడ్డి ఎంపీవో బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఉపాధి హామి కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు ఫాంతో పాటు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, జాబ్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి పంచాయతీ కార్యదర్శికి గానీ ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్‌కు గానీ లేదా కార్యాలయంలో గానీ అందజేయాలని సూచించారు.

### ఆధ్యాత్మికం..

**■ బారడి పోచమ్మ ఆలయ శుద్ధి**



**మద్నూర్(జుక్కల్):** మండల కేంద్రంలోని బారడి పోచమ్మ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని వేదపండితులు శుక్రవారం నిర్వహించారు. ఆలయంలో హోమం, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో అమ్మవారికి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

**■ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**కామారెడ్డి రూరల్:** ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి ఆలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాత్రి శర్మ, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించి ఒడి బియ్యం పోశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**■ శబరి మాత ఆశ్రమంలో ..**



**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు శబరి మాత ప్రతిమ, చిత్రపటం, దివ్యసమాధిని అందంగా అలంకరించారు. అలాగే భగవన్నామ సంకీర్తనలతో భజనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

**■ సోమలింగాల వద్ద అధిక మాసం సప్తాహం**

**నస్రుల్లాబాద్(బాన్సువాడ):** దుర్కి సోమలింగాల ఆలయంలో అధిక మాసం హరినామ సప్తాహ కార్యక్రమం శుక్రవారం 4వ రోజు పూర్తి చేసుకుంది. నెల రోజుల పాటు సాగే ఈ సప్తాహంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కీర్తనలు ఆలపిస్తున్నారు. రాములు మహారాజ్, గ్రామస్తులు దివిటి శ్రీనివాస్, కిషోర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**■ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ పూజలు**



**కామారెడ్డి టౌన్:** జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అధిక శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వైభవంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి 33 రకాల స్వీట్లు నైవేద్యంగా సమర్పించారు. వైభవంగా పూజలు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మొటూరి శ్రీకాంత్, కార్యదర్శి భూమేష్, కోశాధికారి రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.

## ‘కరోనా సమయంలోనూ మేమే పనులు చేశాం’


డీపీవోతో మాట్లాడుతున్న జీపీ కార్మికులు

**బీబీపేట:** కరోనా సమయంలోనూ తామే పని చేశాం కానీ ప్రయివేటు వ్యక్తులు పని చేయలేదని ప్రస్తుతం ప్రయివేటు వ్యక్తులను పెట్టి ఎలా పని చేయిస్తారని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావును పంచాయతీ కార్మికులు ప్రశ్నించారు. శుక్రవారం బీబీపేటలో నిరవధిక సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులతో ఆయన మాట్లాడారు. సమ్మె విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని, బయట వ్యక్తులతో పనులు చేయిస్తే అడ్డుకోవద్దని కార్మికులకు సూచించారు. దీనికి సమ్మె విరమించే ప్రసక్తే లేదని, ప్రయివేటు వ్యక్తులను పెట్టి పని చేయిస్తే ఆత్మహత్యలకు సైతం వెనుకాడమని వారు హెచ్చరించారు.

**మా పొట్ట కొడతారా?**

**భిక్కనూరు:** చాలీచాలని జీతాలతో పనులు చేస్తున్న తమకు మద్దతు ఇవ్వాల్సింది పోయి మా సమ్మెకు తూట్లు పొడుస్తూ పొట్ట కొడతారా అంటూ జంగంపల్లి సర్పంచ్ నర్సింలు యాదవ్‌తో గ్రామ పంచాయతీ సిబ్బంది కార్మికులు శుక్రవారం వాగ్వాదానికి దిగారు. కార్మికులు సమ్మె చేస్తుండటంతో వీధుల్లో చెత్త ఎక్కడిక్కడే పేరుకుపోయింది. దుర్వాసన వస్తుండటంతో సర్పంచ్ నర్సింలు ప్రైవేట్ ట్రాక్టర్ డ్రైవర్‌ను కూలీకి మాట్లాడి చెత్తను తొలగించే చర్యలు తీసుకున్నాడు. ఈవిషయం తెలుసుకున్న కార్మికులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. పలువురు సముదాయించడంతో కార్మికులు శాంతించారు. ట్రాక్టర్‌ను వెనక్కి తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది.

## సబ్‌స్టేషన్లలో కనీస సౌకర్యాలు కరువు


సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

**రామారెడ్డి:** విద్యుత్ సబ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు కూడా లేవని, సిబ్బందికి సరైన సమయానికి వేతనాలు కూడా ఇవ్వటం లేదని శుక్రవారం జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి ఆరోపించా రు. మండలంలోని పోసానిపేట్, రామారెడ్డి విద్యు త్ సబ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎక్కడ కూడా 24 గంటల విద్యుత్ సరఫరా చేయటం లేదని, రేవంత్ రెడ్డి దెబ్బకు 18 నుంచి 20 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, సబ్ స్టేషన్‌లో లాకు బుక్కులే సాక్ష్యమని అన్నారు. సిబ్బందికి కనీస సౌకర్యాలు లేవని, గ్లౌజులు, బూట్లు కూడా సరఫరా చేయడం లేదని అన్నారు. గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది లేక, రైతులు ప్రైవేట్ వారిని ఆశ్రయిస్తున్నారని, దీంతో జేబులకు చిల్లు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోసానిపేట సర్పంచ్, గీరెడ్డి మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


తిమ్మక్‌పల్లి పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎంపీవో మలహరి తదితరులు


పెద్దకొడప్‌గల్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**కామారెడ్డి రూరల్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో మలహరి సూచించారు. శుక్రవారం తిమ్మక్‌పల్లి(కె) గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. ప్రజలు వేడి చేసిన చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా తిమ్మక్‌పల్లి చెరువు నిండడంతో పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ జ్ఞానేశ్వర్, ఉప సర్పంచ్ ప్రశాంత్, కార్యదర్శి ఉన్నారు.

**పెద్దకొడప్‌గల్‌లో..**

**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ డివిజన్ వైద్య బోధకులు దస్రీరాం సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికాల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విఠల్‌బాయి, నాగమణి, రోజా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**బిచ్కుందలో..**

**బిచ్కుంద(జుక్కల్):** ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీపీ కార్యదర్శులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ అశోక్, ఎంపీవో మహిబూబ్ అన్నారు. శుక్రవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యదర్శులు ప్రతి రోజు అన్ని విధులలో పర్యటించి మురికి నీరు నిలువ ఉండకుండాలి చూడాలన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## జూనియర్ కళాశాల వెంటనే మంజూరు చేయండి


మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్, మండల నాయకులు

**బీబీపేట:** రెండేళ్ల క్రితం బీబీపేటకు వచ్చిన సమయంలో జూనియర్ కళాశాలను ప్రారంభిస్తామని చెప్పిన మాట ప్రకారం కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో పాటు మండల బీఆర్ఎస్ నాయకులు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో బీబీపేటలో పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని మంత్రి కేటీఆర్ సైతం చెప్పారని వారికి గుర్తు చేశారు. మండలం నుంచి సుమారు 700 మంది విద్యార్థులు ప్రతి ఏడాది కళాశాల కోసం దోమకొండ, కామారెడ్డికి వెళ్తున్నారని ఆమెకు వివరించారు. విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందిగా మారడంతో ఆడపిల్లలను చదువు మధ్యలో మాన్పిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కళాశాల మంజూరు చేయాలని వారికి విన్నవించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, వెంకట్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థినికి ఆర్థిక సాయం



ఫీజు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**పిట్లం(జుక్కల్):** పిట్లంకు చెందిన పేద విద్యార్థినికి రూ.45 వేల హాస్టల్ ఫీజును మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ పిట్లం శాఖ తరఫున అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్మూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మూడవ సంవత్సరం చదువుతున్న మర్గల వైష్ణవి ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో క్లబ్ తరఫున అందజేస్తున్నామని తెలిపారు. మర్గల వైష్ణవి మంచిగా చదువుకోవాలని సూచిస్తూ.. ఉన్నత విద్యకు సైతం క్లబ్ తరఫున ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చి అభినందించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

### బీఎల్‌వోలకు శిక్షణ


జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు ఎన్నికల అవగాహన సదస్సును శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల వివరాలపై రెవెన్యూ అధికారులు శిక్షణ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైతం అవగాహన సదస్సు నిర్వహించారు.

**తప్పులు దొర్లకుండా చూడాలి**

**ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి):** ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల డీటీ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్లారెడ్డి మండలంలోని బీఎల్‌వోలకు ఓటర్ల జాబితా గురించి శిక్షణనిచ్చారు. ఓటర్ల జాబితాలో మరణించిన వారి వివరాలను తొలగించడం, కొత్త వారి పేర్లను చేర్చడం, పోలింగ్ కేంద్రం మార్పు తదితర దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు.